

# ట్రూ లవ్

## ఇచ్ఛాపురపు రామచంద్రం

ఆ టెలిగ్రాం చూపి ఆరుగురమూ నిజంగానే ఎగిరి గంతులేశాము. ఆ టెలిగ్రాం అందించిన సందేశంలో మే మెవరమూ ఎన్నడూ ఆశించని అద్భుతమయిన విషయం ఒకటుంది. అదేమిటంటే-ట్రెయినింగ్ ఐపోగానే ఎయిర్‌లో రమ్మని. అక్కడ ఆడిట్ జరగ

బోతూంది కనుక—తొందరగా మమ్మల్ని రప్పించవలసిన అగత్యం కంపెనీకి కలిగింది. లేకపోతే మాకు ఎయిర్‌లో ప్రయాణించే అదృష్టమూ, అవకాశమూ యింత త్వరలో రావు. ఆడిట్ పార్టీకి ఎన్నో కృతజ్ఞతలు తెల్పుకున్నాము.

రాజు వెళ్ళి ఫ్లయిట్ వివరాలు కనుక్కొని టికెట్స్ బుక్ చేయించాడు ఆరుగురికీ.

"సోమవారం సాయంత్రంతో ట్రెయినింగ్ ఐపోతుంది. మంగళవారం ఉదయం ఆరుగంటలకి ఫ్లయిట్. అక్కడికి మనం ఎనిమిదిన్నరకి చేరుతాం."

"గాలిలో రెండున్నర గంటలు! వేలమీద రెండున్నర రోజులు! దూరంలో గారడీ...." అన్నాడు మధు.

"పిండి కొద్దీ రొట్టె. డబ్బు కొద్దీ వేగం!" నవ్వాడు విశ్వం.

"మనకి ఎయిర్‌లో వెళ్ళే అదృష్టం లభించిన యీ శుభ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవద్దూ?" నాగరాజు అడిగాడు.

"కోవాలి. కావాలి బుద్ధు. పోవాలి స్వర్గం." శంకరం డ్యాన్సు చేశాడు.

పావుగంటలో సరంజామా వచ్చేసింది. తింటూ—తాగుతూ, తాగుతూ—తింటూ హుషారుగా ఉండగా—ప్రభు అన్నాడు తడబడుతూ- "గ్రేట్ ఐడియా! డియర్ ఫ్రెండ్స్....జాగ్రత్తగా వినండి. ముద్దొచ్చినప్పుడే చంకెక్కమని కదా మనువు నుడివాడు. మనం ఆరుగురమూ ఎయిర్‌పోర్ట్‌లో దిగుతూంటే-మన భార్యలు ఎదురొచ్చి-ఎవరి భార్య వారిని రిసీవ్ చేసుకుంటూ కౌగలించుకుంటే.... ఎలా ఉంటుంది?"

"ఎక్సలెంట్!"

"గ్రేట్!"

"గ్రాషస్!"

"లవ్లీ!"

"కనుక మనం టెలిగ్రాములిద్దాం-శ్రీమతులూ! మంగళవారం ఉదయం ఎనిమిదిన్నరకి వచ్చి, మమ్మల్ని కౌగలించుకుని రిసీవ్ చేసుకోండని."

"బాయ్!" కేకవేశాడు నాగరాజు. "ఆరు టెలిగ్రాం ఫారాలు!" అరిచాడు. వాడు తెల్లబోయాడు. బొను—బట్టల కొట్టుకెళ్ళి బ్రాందీ బాటలిమ్మంటే ఎలా వుంటుందో, మందుపార్టీ మధ్య టెలిగ్రాం ఫారాలకు ఆర్డరిచ్చినా అంతే! విశ్వం హటాత్తుగా పెద్ద నిట్టూర్పు విడిచాడు. టెలిగ్రామ్‌లు పంపేసి

మళ్ళీ రమ్ రంగంలోకి దిగుతూంటే-

"ఏమిటి?" అడిగాడు ప్రభు.

"ప్చ్ ... ముక్క....చుక్క.... బాగానే ఉన్నాయి. మూడోది లేనిదే మజా ఏముంటుంది?"

"బాగుంది. వెనకటికి పెళ్ళి కూతురు తేగలా ఉంటుందంటే తేగని తెమ్మని కూర్చున్నాట్ట ఒకడు. శ్రీమతికి టెలిగ్రామ్ పంపేసరికి నీకు స్త్రీ మీదకు మనసు పోయినట్లుంది. ఓపిక పట్టు! మంగళవారం ఎయిర్‌పోర్టులో దిగగానే శ్రీమతిని తీసుకుని తిన్నగా బెడ్‌రూముకే పోదువుగాని." నాగరాజు నచ్చజెప్పాడు.

మళ్ళీ ఎయిర్‌లో ప్రయాణం గురించి కబుర్లలో పడ్డాం ఆరుగురమూ.

మా ఆరుగురిదీ ఒకే వయసు. సుమారుగా ముప్ఫయికీ ముప్ఫయ్యయిదుకీ మధ్య. కంపెనీలో ఆరు డిపార్ట్‌మెంట్లకి చిన్న ఆఫీసర్లం. కలసీ మెలసీ ఉంటాం.

రిఫ్రెషర్ ట్రెయినింగ్‌కని హెడ్డాఫీసుకి వచ్చాం—పదిహేను రోజుల క్రిందట. మూడు రోజుల్లో యిళ్ళకు వెళ్తాం విమానంలో. శ్రీమతుల్ని వదిలి ఈ చలికాలంలో యిన్నాళ్ళు గడపడం అందరికీ కష్టంగానే ఉంది. అందరమూ తహతహ లాడుతున్నాం-ఎప్పుడు వెళ్ళిపోతామా అని. జన్మానికో శివరాత్రి లా విమానావకాశం వచ్చింది.

* * *

బుధవారం సాయంత్రం!

క్యాంటిన్‌లో కూర్చున్నాను కాఫీ తాగుతూ. నా సెక్షన్ ఆడిట్ ఐపోయింది.

సిగరెట్ పొగలోంచి బయటి ప్రపంచాన్ని చూస్తూంటే చిత్రంగా ఉంది.

ప్రభు వచ్చాడు. విష్ చేసి—ఎదురుగా కూర్చున్నాడు.

హఠాత్తుగా అతని గురించి మిగిలిన మిత్రులు చేసిన కామెంట్ జ్ఞప్తికి వచ్చింది. అతని మీద జాలితో నా ముఖం మారింది. అది గమనించినట్లున్నాడు-"ఏమిటి?"

"ఏమీ లేదులే- చిన్న నిజం! మనం ఆరుగురం పూర్తిగా స్నేహితులం కామేమో!"

"ఎందుకని?"

"స్కాండల్స్ వేసే స్థాయి కంటె ఎదగలేదని నిరూపించబడింది అందుకు."

"స్పష్టంగా చెప్పరాదూ?"

నాకు చెప్పాలనే ఉంది. ఎందు

కంటే ప్రభుమీద నాకు ఎక్కువ ఇష్టం.

"మరోలా తీసుకోవు కదా?"

"నా విషయం నీకు తెలుసు."

"నిజానికి ఇటువంటి పెయిల్ క్యారియింగంటే నా కసహ్యం. కాని—నువ్వు స్కాండల్స్‌లో పడడం.... అందుకని జాగ్రత్త తీసుకుంటావని...."

"నిన్ను అర్థం చేసుకోగలను. అసలు సంగతి చెప్పు!"

"నిన్న ఎయిర్‌పోర్టుకి మీ శ్రీమతి రాలేదు!"

"ఊc."

"దానిమీద—ఇవ్వాళ నువ్వు ఆడిట్‌లో వున్నావు-మధ్యాహ్నం చాలా కామెంట్స్ వచ్చాయి. ఎన్ని కథలు రేగాయని!"

"కథలు?" ఆత్రంగా చూశాడు ప్రభు.

"మనవాళ్ళు తక్కువ వాళ్ళు కారుగా! స్వపరభేదమూ ఉండదు."

"ఊc! ఏమిటా కథలు?"

"ఒకటి రెండు మాత్రం సూచన ప్రాయంగా చెబుతాను. ఏ కథకైనా వస్తువూ, ముగింపూ ఒక్కటే.

"మీ శ్రీమతికి నీ మీద ప్రేమ లేదట. ఆమె ఎవరినో ప్రేమించి విధిలేక నిన్ను పెళ్ళి చేసుకుందట. నువ్వంటే ఆమెకు లెక్కలేదట. అది ఒక కథ. రెండవది నీ అల వాట్లు ఏమీ మంచివి కావట. నీకు లేని వ్యసనం లేదుట."

"ఈ మాటలు మనవాళ్ళే అన్నారా?"

"ఊc. అందుకే మీ దాంపత్య జీవితం సవ్యంగా సక్రమంగా సాగడం లేదుట."

ప్రభు ఏమీ అనలేదు. సిగరెట్ కాలుస్తూ, గ్లాస్ పానల్స్‌లోంచి బయటకు చూస్తున్నాడు.

"ఈ విషయం నీకు చెప్పడం నిజంగా నాకిష్టంలేదు కాని నువ్వూ, నేనూ కొంచెం ఎక్కువ స్నేహి తులమని. బాధపడుతున్నావా?"

"లేదు— జాలిపడుతున్నాను." పొడిగా అన్నాడు, సిగరెట్ పొగ వదులుతూ.

"వద్దు ప్రభూ! సెల్ఫ్ పిటీ అనేది మనిషికి చాలా పెద్ద శత్రువు."

"అది కాదు. మనుషులకి కథలు సృష్టించడంలో ఇంత దుర్మార్గమయిన ఉత్సాహం ఏమిటా అని. అంతే! నీకు విమల గురించి ఎక్కువ తెలియదు. ఎలా తెలు స్తుంది?" ఆగి—"శ్రీమతికి నే నంటే చాలా ప్రేమ. మనమిత్రులు అయిదుగురూ తమ శ్రీమతుల

నుంచి పొందే ప్రేమకంటే నేను నా శ్రీమతి నుంచి అందుకునే ప్రేమ చాలా అధికమేమో" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాను.

"మరి ఆమె ఎయిర్‌పోర్టుకి వచ్చి రిసీవ్ చేసుకోలేదేం?"

"చెప్పానుగా-విమలకి నేనంటే వెర్రి ప్రేమ అని."

"నీ మాటలు పరస్పర విరుద్ధంగా అనిపిస్తున్నాయి. ఏ మాత్రం ప్రేమున్నా శ్రీమతి శ్రీవారిని ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకోదూ? అందులోనూ పదిహేనురోజుల పైగా విరహం. ఎయిర్‌పోర్టు రిసెప్షన్ కూడా మళ్ళీ లభించేదో కాదో?" అన్నాను.

"నువ్వూ వాళ్ళ కథలు నమ్ముతున్నావా?" 'యు టూ బ్రూటస్' అన్నట్లు చూశాడు.

"లేదు. కాని—నిజం తెలుసుకోవాలని ఆతృత పడుతున్నాను. అది కూడా మీ సంసార రహస్యాలు తెలుసుకోవాలనే కుతూహలంకొద్దీ మాత్రం కాదు. వాళ్ళ స్కాండల్స్ పట్టి అబద్ధాలనీ, మీ దాంపత్య జీవితం సవ్యమైనదే అని తేల్చుకుందుకే." ప్రభు-ఏదో చెప్పడానికే నిశ్చయించుకున్నట్లు ముందుకి వంగాడు.

"ప్రేమ పలురకాలు. కనీసం ప్రేమ ప్రదర్శన...."

అర్థంకానట్లు చూశాను.

"కొంతమంది ఎదుటివాళ్ళని కొట్టి తప్ప మాట్లాడలేరు. ఔనా?"

"ఔను. అటువంటి తమాషా మనుషులు నాకూ తెలుసు."

"అలాగే—విమల."

"అంటే?" అర్థం కానట్లుగా మొహం పెట్టి అడిగాను.

"ఆమె పదిహేను రోజుల విరహం అనంతరం నన్ను చూస్తే-మామూలుగా చిరునవ్వుతోనో, చేతులు పట్టుకుని ఊపో ఆహ్వానించలేదు.

"ఒక్కసారి ఆమెకు నన్ను చూడగానే ఉత్సాహమూ, ఉద్రేకమూ ఉప్పెనలా ముంచుకొచ్చేస్తాయి.

"వాటిని ఆమె నిగ్రహించుకోలేదు.

"మనం అంత అడ్వాన్స్ కాలేదు. ఎయిర్ పోర్టులో ఆమె నన్ను కౌగలించుకునీ, ముద్దు పెట్టుకునీ-ప్రేమ ప్రకటిస్తే చూసేవాళ్ళు భరించనూలేరు, ఆమోదించనూ లేరు. అప్పుడు మరిన్ని కథలు."

"నిజంగా నువ్వంటే విమలకంత స్వచ్ఛమైన ఆపుకోలేనంత

ప్రేమా!?" కొంచెం అసూయ తొంగి చూపిందేమో నాలో.

"ఊఁ. బహుశా మనవాళ్ళ శ్రీమతు లెవరూ చేయని పని విమల చేసింది."

"ఏమిటది?"

"క్యూపిడ్స్ నాట్ వేయించు కోడం!"

"క్యూపిడ్స్ నాట్ వేయించు కోడం!?"

"క్యూపిడ్స్ నాట్ అంటే..."

ప్రభు వివరించాడు.

(కాని—నేను ఆ వివరాలు వ్రాయలేను. వ్రాశానో, దీన్ని సెక్స్ కథ అని చిత్తుబుట్టలో తోసేస్తారు. మనవన్నీ డబుల్ స్టాండర్స్. సినిమాల్లోనూ, బొమ్మ ల్లోనూ చూపితే లేని నిషేధం—వ్రాతకు వచ్చేసరికి వచ్చి పడు తుంది. జీవితాన్ని రసమయం చేసే సెక్సుని—రచనలో చూపబోతే- క్షమించరాని నేరం ఔతుంది.)

ఈసారి నాకు తృప్తిగా ఉంది.

జాలిపడవలసింది—ప్రభుమీద కాదు.

ప్రభు—మిగిలివాళ్ళమీద!

నవ్వుతూ అన్నాను—"'ట్రూ లవ్ నెవర్ రన్స్ స్మూత్' అన్న కీట్సోక్తి చాలా నిజం సుమా!"

ప్రభు కూడా నవ్వేశాడు.

ఇద్దరమూ బయటకు వచ్చేశాం.

---

విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 48 రూ॥ |
| అర్థసంవత్సర చందా | 24 రూ॥ |
| విడి ప్రతి | 4 రూ॥ |